క్లుప్తంగా

సీపీఎస్‌ను రద్దు చేయాలి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

న్యాల్‌కల్(జహీరాబాద్): ఉపాధ్యాయులకు శాపంగా మారిన సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని పలువురు ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. న్యాల్‌కల్‌లోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో శనివారం పలువురు ఉపాధ్యాయులు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరుతూ ప్లకార్డులు ప్రదర్శించారు. సీపీఎస్ విధానం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహులు, స్వప్న, జ్యోతి, విజయలక్ష్మి, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి

కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్

పటాన్‌చెరు టౌన్: డ్రైనేజీ సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో హెచ్ఎండబ్ల్యూఎస్ శాఖ మేనేజర్ అరుణ్, ఎస్ఎఫ్ఏ గోవింద్‌లతో కలసి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా జేపీకాలనీ, అంబేడ్కర్ కాలనీలో డ్రైనేజీ సమస్యను కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తెచ్చారు. దీంతో కార్పొరేటర్ పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడి పూడికతీత పనులు ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు.

వెంకటయ్యకు అవార్డు



అవార్డు ప్రదానం చేసి సన్మానిస్తున్న నిర్వాహకులు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని శ్రీమాణిక్ ప్రభు ఉన్నత పాఠశాల వ్యవస్థాపకులు మరెల్లి వెంకటయ్య ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ట్రస్మా ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన ఎడుటెక్ ఎక్స్‌పో కార్యక్రమంలో వెంకటయ్యను సన్మానించి అవార్డును అందజేశారు. వికలాంగుడైన వెంకటయ్య పట్టణంలోని మురికివాడలో పాఠశాలను ఏర్పాటు చేసి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారు. ఎంతో మంది వికలాంగులకు ఉచితంగా విద్యాబోధన చేశారు. ఆయన సేవలను గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


ఘనంగా ఎడ్ల పోలాల అమావాస్య

వట్‌పల్లి(అందోల్): మండలంలోని పోతులబోడుగా గ్రామంలో శనివారం ఎడ్ల పోలాల అమావాస్య పండుగను రైతులు ఘనంగా నిర్వహించారు. పంటలు వేసిన తర్వాత వచ్చే తొలి పండగ కావడంతో రైతులు బసవన్నలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం ఇంట్లో చేసిన వంటకాలను ఎడ్లకు నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం ఎడ్లతో ఊరేగింపు నిర్వహించి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. పంటలు బాగా పండాలని అన్నదాతలు మొక్కులు చెల్లించుకున్నారు.

సింగూర్‌కు ఇన్‌ఫ్లో..

పుల్‌కల్(అందోల్): సింగూర్ ప్రాజెక్టు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ నుంచి 12,957 క్యూసెక్కులు రాగా.. దిగువకు 9.902 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. ఇన్‌ఫ్లో తగ్గడంతో ఒక గేట్ ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం డ్యాంలో 16.854 టీఎంసీల నీటిని నిల్వ చేస్తున్నారు.

బీహెచ్‌ఈఎల్‌లో మాక్ డ్రిల్



రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం పరిధిలోని బీహెచ్‌ఈఎల్ పరిశ్రమలో శనివారం మాక్ డ్రిల్ ఆక్టోపస్ టీం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉగ్రదాడుల సమయంలో వారి చర్యలను అదిగమిస్తూ ఎలా పట్టుకోవాలనే అంశంపై మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా బాంబ్ డిస్పోసల్, సివిల్ పోలీస్, సీఐఎస్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది, మెడికల్ ఎమర్జెన్సీ బృందాలు మాక్ డ్రిల్‌లో పాల్గొన్నాయి. పరిశ్రమలోని కార్మికులకు అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ అత్యవసర సమయాల్లో ఎలా వ్యవహరించాలో ప్రదర్శించారు.

‘పది’ మెమోలు వచ్చేశాయ్

నెల రోజులుగా ఎదురుచూపులు
- పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు
- ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థులు



విద్యార్థులకు మెమోలు అందజేస్తున్న ఉపాధ్యాయులు

న్యాల్‌కల్(జహీరాబాద్): పదవ తరగతి మెమోలు ఎట్టకేలకు పాఠశాలలకు చేరాయి. పదవ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు లాంగ్ మెమోల కోసం నెల రోజులుగా ఎదురుచూస్తున్నారు. బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ నుంచి మూడు రోజులుగా పోస్టు ద్వారా ఆయా పాఠశాలలకు లాంగ్ మెమోలు వస్తున్నాయి. దీంతో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు మెమోలను పంపిణీ చేస్తున్నారు. చాలా రోజుల తర్వాత మెమోలు రావడంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పదవ తరగతి వార్షిక పరీక్షలు గత మార్చి 21 నుంచి ఏప్రిల్ వరకు కొనసాగాయి. జిల్లాలో 467 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 22,374 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. అందులో 22,170 మంది ఉత్తీర్ణులయ్యారు. ఏప్రిల్‌లోనే మూల్యాంకనం కూడా నిర్వహించారు. పరీక్షల్లో తప్పిన వారికి జూన్ మాసంలో అడ్వాన్స్‌డ్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు రాసి చాలా రోజులైన మెమోలు సకాలంలో రాకపోవడంతో పదిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మెమోల కోసం ఎదురుచూస్తున్నారు. సాధారణంగా జూన్ చివరలో లేదా జూలై మాసంలో పదవ తరగతి లాంగ్ మెమోలు వచ్చేవి. అంతకంటే ముందు షాట్ మెమోలు వచ్చేవి. ఈ సారీ మెమోలు రాకలో కొంత ఆలస్యమైంది. ఇంతకుముందు విద్యార్థులకు మార్కులకు బదులుగా గ్రేడ్ పాయింట్లు కలిపి మొత్తంగా జీపీఏ విధానం ఉండేది. కాని ఈ సారి ఆ విధానానికి బదులుగా సెకండరీ బోర్డు స్వల్ప మార్పులు చేసింది. గ్రేడ్ పాయింట్లతో పాటు ఆయా సబ్జెక్టులో మార్కులను పొందుపర్చింది. కాని మొత్తం మార్కులను మాత్రం మెమోల్లో చూపలేదు. ఈ కారణంగా మెమోలు జారీలో ఆలస్యం జరిగి ఉండవచ్చుననే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మూడు రోజుల నుంచి స్పీడ్ పోస్టు ద్వారా మెమోలు వస్తున్నాయి. విద్యార్థులకు పాఠశాలలకు వచ్చి తీసుకెళ్తున్నారు.

పోస్టు ద్వారా మెమోలు



బోర్డు ఆఫ్ సెకండరీ పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరికీ స్పీడ్ పోస్టు ద్వారా మెమోలను ఆయా పాఠశాలలకు పంపించింది. వచ్చిన మెమోలను ఉపాధ్యాయులు విద్యార్థులకు అందజేస్తున్నారు. అన్ని పాఠశాలలకు మెమోలు అందాయా?లేదా? అనే విషయాలను పరిశీలిస్తున్నాం.

–వెంకటేశ్వర్లు డీఈఓ, సంగారెడ్డి

ఆలయాల్లో భక్తుల సందడి



నవగ్రహాలకు పూజలు చేస్తున్న భక్తులు



నైవేద్యాలు సమర్పించిన అర్చకులు

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధి ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో శనివారం భక్తుల సందడి నెలకొంది. శ్రావణమాసం చివరి శనివారం అమావాస్య కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి దైవదర్శనం చేసుకున్నారు. న్యాల్‌కల్, మల్గి, అమీరాబాద్, హుస్సేన్‌నగర్, రాఘవాపూర్ తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదానం చేశారు.

కిటకిటలాడిన శనీశ్వరాలయం

నారాయణఖేడ్: మండలం పరిధి పంచగామలోని శనీశ్వరాలయం శనిఅమావాస్య, శ్రావణమాసం చివరిరోజు కావడంతో భక్తులతో కిటకిటలాడింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగురాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారు జామునుంచే భక్తులు బారులుతీరి శనీశ్వరుడికి తైలాభిషేకాలు చేసి టెంకాయల్ని నైవేద్యాలుగా సమర్పించారు. ఆలయ పీఠాధిపతి కాశీనాథ్ మహరాజ్ ఆధ్వర్యంలో ప్రత్యేకపూజ, హోమం, పూర్ణాహుతి, మహాప్రసాద వితరణ నిర్వహించారు. ఖేడ్ ప్రాంతంలోని వివిధ ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి.

గ్రామాభివృద్ధికి పరిశ్రమ చేయూత

జిన్నారం (పటాన్‌చెరు): గడ్డపోతారం పట్టణ పరిధిలోని అలీనగర్ గ్రామ అభివృద్ధికి అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ. 2 లక్షలను మాజీ సర్పంచ్ పులిగిల్ల ప్రకాశం చారి ఆధ్వర్యంలో గ్రామస్తులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి పరిశ్రమ సహకారం ప్రశంసనీయమన్నారు. రెండు లక్షల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ సందర్భంగా పరిశ్రమ ప్రతినిధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు వీరేశంగౌడ్, స్థానిక నాయకులు బాలయ్య, వేణు, పెంటేశ్, కుమార్, స్థానికులు పాల్గొన్నారు.



చెక్కును అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధి

వర్షాలకు దెబ్బతిన్న కల్వర్టు

జహీరాబాద్ టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు నియోజకవర్గంలో తీవ్రనష్టం కలిగించాయి. చాలా ప్రాంతాల్లో రోడ్లు, పంట పొలాలు, కల్వర్టులు, ఇళ్లు దెబ్బతిన్నాయి. మండలంలోని కాశీంపూర్ రోడ్డుకు మధ్యలో నిర్మించిన కల్వర్టు వర్షాలకు దెబ్బతింది. బూచినెల్లి శివారులో జాతీయ రహదారి నుంచి కాశీంపూర్‌కు వెళ్లే దారిలో వాగుపై రాకపోకల కోసం కల్వర్టును నిర్మించారు. ఈ రోడ్డు గుండా రైతులు పొలాలకు వెళ్తుంటారు. భారీ వర్షాల వల్ల వరద ప్రవాహానికి కల్వర్టు మట్టికొట్టుకుపోయి రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దెబ్బతిన్న కల్వర్టుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



దెబ్బతిన్న కల్వర్టు

హామీలను విస్మరించిన ప్రభుత్వం

జహీరాబాద్: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి జె.నర్సింగ్ రావు విమర్శించారు. శనివారం జహీరాబాద్‌కు వచ్చిన సందర్భంగా వికలాంగులతో సమావేశమై ఈనెల 24 న మందకృష్ణ సభ నిర్వహణపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే వికలాంగులకు రూ.6వేలు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలకు రూ.4వేలకు పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అయినా మర్చిపోయారని, ప్రతిపక్ష పార్టీలు సైతం ప్రభుత్వాన్ని ప్రశ్నించడం లేదని విమర్శించారు. సమావేశంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ ఆర్.నర్సింహులు, సంఘం నాయకులు వసిమాబేగం, బిస్మిల్లా, శోభారాణి, అబ్రహాం మాదిగ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింగ్‌రావు

నష్టపరిహారం మంజూరు చేయండి

మునిపల్లి(అందోల్): ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలకు ఎకరాకు రూ.25 వేల చొప్పున నష్ట పరిహారం మంజూరు చేసి ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి ఎం. గంగమ్మ శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పత్తి, పెసర, మినుము పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయన్నారు. కార్యక్రమంలో మల్లమ్మ, పుల్లమ్మ, మున్నిబాయ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన



పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జహీరాబాద్: అధిక వర్షాల కారణంగా పంటలకు ఏ మేరకు తెగుళ్లు సోకాయనేది తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు ఆయా పంటలను పరిశీలించారు. శనివారం సంగుపేటలోని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం(టీఆర్‌వీకే) శాస్త్రవేత్తలు ఎ.నిర్మల, కె.అరుణ, కె.రాహూల్ విశ్వకర్మలు కోహీర్ మండలంలోని కోహీర్‌తో పాటు పలు గ్రామాల్లో పర్యటించారు. ప్రధానంగా పత్తి, మొక్కజొన్న, కంది పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు చేశారు. పత్తి పంటలో రసం పీల్చే పురుగులు అయిన పచ్చదోమ, లద్దె పురుగు, గులాబీ పురుగు, తెల్లదోమ ఉనికిని గుర్తించడానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్, ఏఈఓలు శ్రీనివాస్, ప్రశాంత్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

నలుగురి అరెస్టు

జహీరాబాద్: మండలంలోని అల్లీపూర్ గ్రామంలో పేకాట స్థావరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినయ్‌కుమార్ తెలిపారు. శనివారం నమ్మదగిన సమాచారం అందుకుని దాడిచేసి పేకాట ముక్కలు, రూ.1,400 నగదు, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

సబ్సిడీ యంత్రాల కోసం దరఖాస్తులు

రాయికోడ్(అందోల్): ఐదెకరాల లోపు భూమి ఉన్న ఎస్సీ, ఎస్టీ మహిళా, చిన్న సన్నకారు రైతులు సబ్సిడీపై అందించే యంత్ర పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సారిక రైతులకు సూచించారు. ఈ నెల 30న వరకు రైతు వేదికల్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. మండల కమిటీ ద్వారా అర్హులను ఎంపిక ఉంటుందన్నారు. ఐదెకరాల లోపు భూమి ఉన్న రైతులకు 50 శాతం, ఐదెకరాల కంటే ఎక్కువ భూమి ఉన్న రైతులకు 40 శాతం సబ్సిడీపై వివిధ రకాల వ్యవసాయ యంత్రాలు, పరికరాలు పొందవచ్చన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **‘నారింజ’కు తగ్గిన వరద**

జహీరాబాద్ టౌన్: మండలంలోని కొత్తూర్(బి) వద్ద ఉన్న నారింజ ప్రాజెక్టుకు వరద తగ్గుముఖం పట్టింది. ఇటీవల కురిసిన వర్షాలకు నారింజ ప్రాజెక్టుకు వరదనీరు భారీగా రావడంతో గేట్ల ఎత్తి దిగువకు వదిలారు. నిండుకుండలా ప్రవహిస్తూ వాగుపై నిర్మించిన బ్రిడ్జిపై నుంచి నీరు పారడంతో రోడ్డును మూసేశారు. దీంతో రెండు మూడు రోజుల పాటు రాకపోకలు బంద్ అయ్యాయి. వరద తగ్గుముఖం పట్టడంతో బూచినెల్లి, ఘనాపూర్ రోడ్డుపై రాకపోకలు తిరిగి ప్రారంభమైయ్యాయి. అల్గోల్–పొట్‌పల్లి గ్రామాల మధ్యన ఉన్న వాగు ఉధృతి కూడా తగ్గడంతో రాకపోకలు యథావిధిగా కొనసాగుతున్నాయి.

◆ **ఎల్‌ఓసీ అందజేత**

నారాయణఖేడ్: సీఎం సహాయనిధి పేదలకు వరమని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ తెలిపారు. పెద్దశంకరంపేటకు చెందిన ప్రేమలకు ఆస్పత్రి ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా రూ.2.50 లక్షల మంజూరుకు సంబంధించిన ఎల్‌ఓసీని శనివారం బాధితురాలి కుటుంబీకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.10 లక్షలకు పెంచామన్నారు.

◆ **లోకకల్యాణం కోసం చండీహోమం**

కల్హేర్(నారాయణఖేడ్): మండలంలోని బల్కంచెల్క తండా (భక్తిధాంతండా)లో శనివారం లోక కల్యాణం కోసం త్రివింశతి చండీహోమం నిర్వహించారు. తండాలోని విశ్వపాళిని భవానీ సమేత సేవాలాల్ మహరాజ్ మహా మందిరంలో ధర్మకర్త, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ మూడ్ కిషన్ లలిత దంపతుల ఆధ్వర్యంలో హోమం చేపట్టారు. ప్రధాన అర్చకులు మనోజ్‌శర్మ నేతృత్వంలో గణపతి గౌరీ స్వస్తి పుణ్యాహవచనం, విశేష అభిషేకం, మంగళహారతి, తీర్థప్రసాదాలు చేపట్టారు.

◆ **నిబంధనలు పాటించాలి**

పటాన్‌చెరు టౌన్: పోలీస్‌శాఖ నిబంధనలు పాటిస్తూ భక్తి శ్రద్ధలతో గణేష్ నవరాత్రులను జరుపుకోవాలని బీడీఎల్ సీఐ విజయ్‌కృష్ణ నిర్వాహకులకు సూచించారు. గణేష్ మండపాల నిర్వాహకులతో శనివారం రాత్రి కర్దనూర్ సమీపంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండపాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ లక్ష్మారెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ అసదుల్లా షరీఫ్



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి అసదుల్లా షరీఫ్

వట్‌పల్లి(అందోల్): ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన కల్గి ఉండాలని జోగిపేట జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసు కమిటీ చైర్మన్ మహమ్మద్ అసదుల్లా షరీఫ్ అన్నారు. శనివారం మండలంలోని పోతులబోగుడా మోడల్ పాఠశాల, మర్వెల్లి ఉన్నత పాఠశాలలో న్యాయ విజ్ఞాన సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలకు చట్టాలపై అవగాహన కలిగి ఉంటే ఆత్మస్థైర్యం పెరుగుతుందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పే నిజాలను గ్రహించాలన్నారు. విద్యా హక్కు చట్టం, చైల్డ్ మ్యారేజ్ , పోక్సో, మోటార్ వెహికల్ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు వాట్సాప్, ట్విట్టర్ ,ఇన్‌స్టాగామ్ వంటివి అవసరానికి మించి ఉపయోగించొద్దన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు శివప్రసాద్, నర్సింలు, సార వెంకటేశం, వెంకటకృష్ణ, ఎస్ఐ–2 శ్రీహరి, ప్రిన్సిపాల్ డీనా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాజీమార్గంలో కేసులు పరిష్కరించాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీ చంద్ర



సమావేశంలో మాట్లాడుతున్న భవానీచంద్ర

సంగారెడ్డి టౌన్ : రాజీమార్గంలో కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భవానీచంద్ర సూచించారు. సంగారెడ్డిలోని జిల్లా కోర్టులో పోలీసులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరిగి సమయం వృథా చేసుకోవద్దన్నారు. పోలీసులు, న్యాయవాదులు సహకరించాలని చెప్పారు. సెప్టెంబర్ 13న నిర్వహించే లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జడ్జిలు, న్యాయవాదులు, పోలీసులు పాల్గొన్నారు.

భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నంబర్ 243లోని ప్రభుత్వ భూముల కబ్జాను రెవెన్యూ యంత్రాంగం అడ్డుకుంది. ఈ మేరకు శనివారం తహసీల్దార్ దేవదాస్ ఆదేశాల మేరకు ఆర్ఐ జయప్రకాశ్‌నారాయణ 29 గుంటల ప్రభుత్వ భూమిలో సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జా చూస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేశామని చెప్పారు. ఈ భూముల్లో కొనుగోలు, అమ్మకాలు జరిపితే క్రిమినల్ కేసులు పెట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు.



హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన ఆర్ఐ

పిచ్చి మొక్కల తొలగించండి

జోగిపేట(అందోల్): జోగిపేట మున్సిపాలిటీ పరిధిలోని 10,11 వార్డుల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని కాలనీకి చెందిన యువకులు శనివారం మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు వినతి పత్రం ఇచ్చారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ లోపించిందని.. పిచ్చి మొక్కలు పెరగడం వల్ల దోమలు బెడద తీవ్రంగా ఉందన్నారు. ఇళ్లలోకి పాములు వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పిచ్చి మొక్కలు తొలగిస్తామని కమిషనర్ వారికి హామీ ఇచ్చారు. కాలనీకి చెందిన రాములు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, యువకులు సంతోష్, సంతోష్ కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న యువకులు

తోపుడు బండ్ల తొలగింపు.. జరిమానా



తోపుడు బండ్లను తొలగిస్తున్న పోలీసులు

జహీరాబాద్: పట్టణంలో 65వ జాతీయ రహదారిని ఆక్రమించి తోపుడు బండ్లు, దుకాణాలు ఏర్పాటు చేసుకుని ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తున్నందునా పోలీసులు వాటిని నియంత్రించారు. శనివారం ఎస్ఐ వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు భవానీ మందిర్ రోడ్డు నుంచి బస్టాండ్ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పండ్లు, కూరగాయల బండ్లను రోడ్లపై నిలిపి విక్రయించడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందని, వాహనాల రాకపోకలకు, పాదచారులు నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారని పోలీసులు పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకుని రహదారిపై వ్యాపారాలు నిర్వహిస్తున్న 28 మందికి ఈ–చలానా కేసుల జరిమానా విధించారు. ఈ సందర్భంగా రూ.20,475లను జరిమానా కింద వసూలు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. మూడు డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు.

సామాజిక సేవే లక్ష్యంగా లయన్స్ సేవలు

జోగిపేట లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రవిశేఖర్‌రెడ్డి

వట్‌పల్లి(అందోల్): సామాజిక సేవే లక్ష్యంగా లయన్స్‌క్లబ్ సేవలు అందిస్తుందని జోగిపేట లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రవిశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం అందోల్ మండలంలోని రోళ్లపాడ్‌లో ప్రోగ్రాం చైర్మన్ మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రామం చేపట్టారు. ఈ సందర్భంగా 150 మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 28 మంది చిన్నారులకు పలకలు, బలపాలు, న్యూట్రిషన్ జ్యూస్ అందజేశారు. అనంతరం హెల్త్ క్యాంపు నిర్వహించి రోగులకు వైద్య సేవలు అందించారు. పర్మెంట్ ప్రాజెక్టు కింద జోగిపేటలోని డి.ఎస్.రెడ్డి ఆస్పత్రి ఆవరణలో కొనసాగుతున్న డయాబెటిస్ క్యాంపులో భాగంగా 25 మందికి షుగర్ టెస్టులు చేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ పీఆర్ఓ డాక్టర్ కే.అనంతరెడ్డి, కార్యదర్శి గడ్డమీది సంతోష్, సీనియర్ సభ్యులు రాచకొండ ప్రదీప్‌గౌడ్, యశ్వంత్ రెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ నర్సింలు పాల్గొన్నారు.



చిన్నారులకు పలకలు అందజేస్తున్న సభ్యులు

మమ అనిపించారు..

- తూతూమంత్రంగా ప్రిన్సిపాల్‌పై విచారణ
- ఆందోళన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

నారాయణఖేడ్: ఖేడ్‌లోని పెద్దశంకరంపేటకు చెందిన మహాత్మాజ్యోతిబా పూలే బీసీ గురుకులంలో గురుకులాల రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ తిరుపతి శుక్రవారం రాత్రి విచారణ చేపట్టారు. ప్రిన్సిపాల్ అక్రమాలు, విద్యార్థులకు అనారోగ్యాలు, నాణ్యతలేని భోజనం, అధ్వానస్థితిలో కొనసాగుతున్న గురుకులం దుస్థితిపై , ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆకస్మిక తనిఖీపై పత్రికల్లో కథనాలు వచ్చాయి. దీంతో ఆర్సీఓ పలు అంశాలపై విచారణకు వచ్చారు. కాగా డిప్యూటీ సెక్రటరీకి ప్రిన్సిపాల్, పీఈటీ రామారావు మరో ఇద్దరు ఉపాధ్యాయులు తప్పుడు సమాచారం ఇవ్వడమే కాకుండా ప్రశ్నించే విద్యార్థులకు దాడులకు పాల్పడే గ్రూప్‌గా ఉన్న కొందరు విద్యార్థులతో ప్రిన్సిపాల్ మంచోడని చెప్పించారని తెలిసింది. మొత్తం మీద గురుకులాల ఉన్నతాధికారి సూచన మేరకు ప్రిన్సిపాల్‌ను కాపాడేందుకు విచారణ మమ అనిపించారని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

పీహెచ్‌సీ వైద్యుడు సాయి శంకర్

కంది(సంగారెడ్డి): వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం అధికంగా ఉంటుందని కంది ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు సాయి శంకర్ పేర్కొన్నారు. శనివారం కందిలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రతపై పంచాయతీ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గుంతల్లో నీరు నిల్వ ఉండకుండా పూడ్చాలన్నారు. వాటర్ ట్యాంకులను ప్రతి 15 రోజులకు ఒకసారి శుభ్రం చేస్తుండాలని చెప్పారు. పాత టైర్లు, పూల కుండీల్లో నిలిచే నీటితో దోమలు అధికమై ప్రజలు డెంగ్యూ, మలేరియా వంటి రోగాల బారిన పడే ప్రమాదం ఉందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ కవిత, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.